సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



కదలని 'స్త్రీనిధి'
స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాల మంజూరు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా నీరసించింది. 8లో



..జెన్‌కోనే నిర్మించాలి
రామగుండంలో విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలంటూ విద్యుత్ ఇంజనీర్లు, కార్మికులు ఆందోళన చేపట్టారు. 8లో



వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత కొంత అధికంగా ఉన్నా.. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నయనానందకరం.. రామయ్య నిత్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన


అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, మంత్రపుష్పం, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు 'నిధి ఆప్ కే నికట్'

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిధి ఆప్ కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లు కె.సునీల్, రబీలాల్‌దాస్ తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యోగులు, పెన్షనర్లకు మధిర పంచాయతీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లా వాసులకు లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి హైస్కూల్ యమునా క్యాంపస్‌లో కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9–15నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ప్రారంభ శూరత్వమేనా?

సీతారామ పంపుహౌస్‌ల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి

- పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక ఇక్కడే ఫోకస్ చేసిన మంత్రులు
- 'డిస్ట్రిబ్యూటరీ' పనుల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- పంపుల ప్రారంభం తర్వాత మిగిలిన పనుల్లో తగ్గిన వేగం
- సీతారామ ప్రాజెక్టులపై నేడు సమీక్ష


ములకలపల్లి మండలంలో ట్రయల్‌రన్ చేసిన పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికలు ముగిసింది మొదలు స్వాతంత్య్ర దినోత్సవం వరకు సీతారామ ఎత్తిపోతల పథకం పనులు చకచకా సాగాయి. ఆ తర్వాత ప్రాజెక్టు పనుల్లో మునుపటి వేగం మందగించడంతో పాటు సరికొత్త సవాళ్లు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం సీతారామ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు.

ప్రాథమిక నోటిఫికేషన్ జారీ..
ఒకటి, రెండు చోట్ల మినహాయిస్తే సీతారామ ప్రాజెక్టులో 104 కిలోమీటర్ల వరకు ప్రధాన కాలువ పనులు పూర్తయ్యాయి. మూడు పంపుహౌస్‌ల్లో రెండు, అంతకుమించి మోటార్లు ఎత్తిపోతలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుత ప్లాన్ ప్రకారం మూడు చోట్ల డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు నిర్మిస్తే 1.07 లక్షల కొత్త ఆయకట్టు జిల్లాలో అందుబాటులోకి వస్తుంది. దీని కోసం 3,273 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉండగా రూ. 1,166 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. పంపుహౌస్‌లు ప్రారంభమైన వెంటనే భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. అయితే భూ సేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసినట్టు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వెల్లడించారు.

నిధులు వస్తేనే పురోగతి..
భూ సేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ కావడంతో ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతేనే గ్రామసభల నిర్వహణ, నష్టపరిహారం ప్రకటన తదితర అంశాల్లో పురోగతి రానుంది. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి, నవంబర్ నుంచి జూన్ వరకు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణం పూర్తి చేస్తే వచ్చే ఖరీఫ్ సాగుకు గోదావరి జలాలు జిల్లాలోని పొలాల్లోకి పారుతాయి. లేదంటే రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణ తప్పితే ఈ ప్రాజెక్టు వల్ల రెండు జిల్లాల్లో కొత్తగా వచ్చే ఆయకట్టు ఉండదు. భద్రాద్రి జిల్లా రైతులకైతే తీవ్ర నిరాశే మిగులుతుంది.

ప్రహసనంలా సీతమ్మ సాగర్..
దుమ్ముగూడెం – అశ్వాపురం మధ్యన గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ ఆనకట్ట డీపీఆర్‌కు అనుమతులు సాధించడం ప్రహసనంలా మారింది. గత ప్రభుత్వ హయాంలో కేంద్రం పెట్టిన కొర్రీలతో ఈ పరిస్థితి ఎదురైంది. అయితే సీతమ్మసాగర్ డీపీఆర్‌కు అన్ని అనుమతులు సాధ్యమైనంత త్వరగా తెస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అన్నట్టుగానే గత ఆగస్టు చివరి నాటికి టెక్నికల్ అప్రైజల్ కమిటీ నుంచి సానుకూల ఫలితం సాధించారు. అయితే ఆ తర్వాత ఈ అంశంపై కదలిక లేదు. ఇప్పటికే పర్యావరణ అనుమతులు రాక పనులు నిలిచిపోయి ఏడాదిన్నర కావస్తోంది. అక్టోబర్‌లో గోదావరిలో నీటిమట్టం తగ్గితే నవంబర్ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాల్సిన అవసరం ఉంది.

అదే స్ఫూర్తితో పని చేస్తేనే..
2026 ఆగస్టు 15 నాటికి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పంపుహౌస్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా హామీ ఇచ్చారు. అదే సమయంలో గడిచిన ఐదు నెలల కాలంలో రూ. 500 కోట్లు ఖర్చు చేసి పంప్‌హౌస్‌లు, రాజీవ్ కెనాళ్లను అందుబాటులోకి తెచ్చామని మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇక అదే స్ఫూర్తితో పనిచేసి రాబోయే రోజుల్లో అనుమతులు, భూసేకరణ, నిధుల కొరత లేకుండా చూడడంతో పాటు జిల్లాలో డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు నిర్మించాలని, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాలకు గోదావరి నీళ్లు తీసుకెళ్లేలా యాతాలకుంట, జూలూరుపాడు టన్నెల్, దమ్మాయిగూడెం టన్నెల్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వేగం తగ్గిన పనులు..
అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం గ్రామం దగ్గర ప్రధాన కాలువ, విజయవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ – 30) కలుస్తున్నాయి. దీంతో ఇక్కడ వంతెన నిర్మాణం కోసం ఆగమేఘాల మీద అనుమతులు తెచ్చి పనులు చేపడుతున్నారు. శరవేగంగా పనులు చేయడంతో చివరి దశకు వచ్చాయి. ఆగస్టు 15 కల్లా ఈ వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని తొలుత ప్రకటించినా నేటికీ పనులు పూర్తి కాలేదు. పంప్‌హౌస్‌ల ప్రారంభోత్సవం తర్వాత వంతెన పనులపై పర్యవేక్షణ తగ్గడం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఐలమ్మ జీవితం.. ఆదర్శనీయం

కలెక్టర్ జితేష్ వి పాటిల్


ములకలపల్లి : కర్రతో చేసిన విగ్రహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ వీరవనిత ఐలమ్మ సామాజిక, ఆధునిక పరిణామానికి నాంది పలికిన ధీశాలి అని కొనియాడారు. భూ పోరాటం నుంచి సాయుధ పోరాటం చేసిన వీరవనిత అన్నారు. విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు అవగాహన చేసుకుని అధికసంఖ్యలో నమోదు చేసుకోవాలని సూచించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ విద్యాచందన, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, బీసీ సంక్షేమాధికారి ఇందిర, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, బీసీ సంఘం నాయకులు ఇంద్రాల దుర్గయ్య, సుంకర అజిత్, నేరెళ్ల రమేష్, చిటికెన ముసలయ్య, కాపర్తి వెంకటాచారి, ముదిగొండ రాంబాబు, సర్వేష్, నీలావతి, లలిత, విజయలక్ష్మి, అంజమ్మ, కొదుమూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

బయో మైనింగ్‌తో చెత్త నియంత్రణ
మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల ప్రక్షాళన కోసం బయో మైనింగ్ విధానంలో చెత్తను శుద్ధి చేసేందుకు వీలుగా అన్ని పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పాటిల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బయోమైనింగ్ విధానం ద్వారా డంపింగ్ యార్డులో భారీగా పేరుకుపోయిన చెత్తను మిషన్ల ద్వారా శుద్ధి చేయొచ్చని సూచించారు. వివిధ పరిమాణంలో ఉన్న వ్యర్థాలు వివిధ దశలలో బయటకు వస్తాయని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే కంపెనీలకు అమ్మడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో బయోమైనింగ్ ప్లాంట్‌ల ప్రారంభానికి త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు దామోదర్‌రావు, మధు, డీపీఓ బాబురావు, జిల్లా కాలుష్య నివారణ అధికారి రవీందర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి
ములకలపల్లి : పూర్వీకుల నుంచి సంప్రదించిన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. మండలపరిధిలోని మాధారంలో ఏర్పాటు చేసిన నాయకపోడు గిరిజన హస్తకళల కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాయకపోడు కుల ఆచారాలు, కొలుస్తున్న దేవతల విగ్రహాలు, కర్ర మాస్కులను ప్రత్యేకమైన పొనికి కర్రతో తయారుచేయడం అభినందనీయమన్నారు. అన్నిరకాలు బొమ్మలు, ఆటవస్తువులు రూపొందించి ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. రూ. 31.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను దిగ్విజయంగా నడిపించాలని అన్నారు. ఈ సందర్భంగా తమకు పోడు పట్టాలివ్వాలని, తమకు ఎస్టీ రిజర్వేషన్లు సక్రమంగా అందేలా చూడాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఏపీఓ డేవిడ్‌రాజు, ఎంపీఓ లక్ష్మయ్య, ఏపీఎం సంపత్‌కుమార్, ఏఈలు సురేశ్, వరప్రసాద్, ఆర్డైలు భద్రు. సత్యావతి, నాయకపోడు ప్రతినిధులు పసుల బుచ్చయ్య, పసుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

దుమ్ముగూడెం : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా చైల్డ్ హెల్త్, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. మండలంలోని ఏకలవ్య బాలురు, బాలికల వసతిగృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. వంటశాల, టాయిలెట్లు, డార్మెటరీలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరిశుభ్రమైన ఆహారం, నీటిని తీసుకోవాలని సూచించారు. వసతిగృహంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఏఎన్‌ఎంకు తెలియజేయాలని, స్థానిక పీహెచ్‌సీలో పరీక్షలు చేయించాలని అన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సర్వైలెన్స్ అధికారి డాక్టర్ సాయి కళ్యాణ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ఐటీడీఏ పీఓ రాహుల్


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: మెరిట్ సాధిస్తున్న గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాల(బాలికలు)లో ఆరు నుంచి ఇంటర్ వరకు చదివిన మడవి దయానా లాసెట్‌లో 3,500 ర్యాంక్‌తో హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో సీటు సాధించింది. దీంతో ఆమెకు ప్రోత్సాహకంగా ఐటీడీఏ నుంచి రూ.36 వేల చెక్కును పీఓ గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యుత్తమ చదువుతో సీటు సాధించిన దయానా ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో న్యాయ విద్య పూర్తి చేసి పేదలకు సహాయ పడాలని సూచించారు. ఉన్నత స్థానానికి చేరుకొని స్వగ్రామం జగ్గారానికి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, విద్యార్థిని తల్లి సుజాత, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలమంతా రామనామం!

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన పట్టణ వ్యాప్తంగా మైకులు ఏర్పాటు చేయిస్తున్నారు. ఆలయంలో జరిగే నిత్య పూజలతో పాటు రామనామం, కీర్తనలను భక్తులతో పాటు పట్టణవాసులకు వినిపించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆలయం నుంచి బస్టాండ్, డిగ్రీ కళాశాల రూట్లలో వీటిని అమర్చారు. ఒకటి, రెండో రోజుల్లో పనితీరును పరీక్షించాక మైక్‌లను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ఆపద వస్తే కాపాడండిలా..


పేరంటాల చెరువు వద్ద మత్స్యకారులతో అధికారులు

మణుగూరు టౌన్: వరదలు వచ్చినప్పుడు కొట్టుకుపోయే బాధితులను కాపాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. తహసీల్దార్ల ద్వారా మత్స్య సొసైటీలకు అందజేసిన తెప్పలతో గురువారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంబాయిగూడెం గ్రామ పంచాయతీలోని పేరంటాల చెరువులో డెమో నిర్వహించారు. వరదల్లో కొట్టుకుపోయే బాధితుడిని జాలర్లు పట్టుకునే విధానంతో పాటు ధైర్యంగా తెప్పపై ఎక్కించి తరలించడంపై అశ్వాపురం, పినపాక, మణుగూరు మండలాల జాలర్లకు వివరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సీనియర్ అసిస్టెంట్ నూరుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ తెల్లూరి శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, వీరస్వామి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ జోనల్ క్రీడా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

ఇల్లెందు: ఈ నెల 29, 30వ తేదీల్లో కొత్తగూడెంలో అటవీశాఖ జోనల్ క్రీడలు జరగనుండగా, జిల్లా జట్టును గురువారం ఇల్లెందులోని ఫారెస్టు గ్రౌండ్‌లో ఎంపిక చేశారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, ఇల్లెందు ఎఫ్‌డీఓ ప్రసాద్, జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాదరావు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం


పొలంబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ మహేందర్

జూలూరుపాడు: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ అన్నారు. మండలంలోని అనంతారంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడి ఆర్థికంగా బలపడాలన్నారు. పొలం బాట కార్యక్రమం ద్వారా ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరి చేయడంతో పాటు విరిగిన, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చుతామని తెలిపారు. వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేస్తామని చెప్పారు. వర్షం వచ్చినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులను, కాలిన తీగలను మార్చొద్దని కోరారు. విద్యుత్ మోటార్లకు తగిన కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ కొత్తగూడెం డీఈ రంగస్వామి, ఏడీఈ యాసిన్, జూలూరుపాడు ఏఈ సతీష్ కుమార్, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, ఎస్ఎల్ఐ నరసింహారావు, లైన్‌మెన్ రమేష్, జేఎల్ఎం ఎస్ భాస్కర్, వెంకటేశ్వర్లు, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

పేదల ముంగిట ఖరీదైన వైద్యం

- కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ఇద్దరికి థైరాయిడ్ సర్జరీ
- ఇల్లెందులో ఎండోస్కోపీ ద్వారా ఈఎన్‌టీ ఆపరేషన్
- వైద్యులకు ఉన్నతాధికారుల అభినందన


ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు


శస్త్రచికిత్స తర్వాత కలీంతో రవిబాబు, వైద్యులు

ఇల్లెందు/కొత్తగూడెంరూరల్ : జిల్లాలోని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి, కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రిలో వైద్యులు గురువారం అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఇల్లెందులో ఎండోస్కోపీ ద్వారా ముక్కు దూలం వంకర, పెరిగిన కండ తొలగింపు ఆపరేషన్ సక్సెస్ చేయగా, జిల్లాలోనే ఇది తొలిసారి కావడం విశేషం. 12 ఏళ్లుగా ముక్కు జబ్బుతో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఈఎన్‌టీ వైద్యులు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి. రవిబాబు ఆధ్వర్యంలో ఆపరేషన్ చేశారు. ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే ఈ చికిత్సకు రూ.50 వేలు, హైదరాబాద్‌లో అయితే రూ.1.50 లక్షలు ఖర్చయ్యేవి. కానీ ఇల్లెందు ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవల కింద పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. ఇల్లెందు స్టేషన్ బస్తీకి చెందిన మున్సిపల్ వర్కర్ అబ్దుల్ కలీం 12 ఏళ్లుగా ముక్కు దిబ్బడి, శ్వాస సమస్యలతో బాధపడుతున్నాడు. శ్వాస సమస్యతో పాటు తరుచూ తలనొప్పి వస్తుండేది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడు. అతడికి ఆపరేషన్ చేసేందుకు ఈఎన్‌టీ వైద్యురాలు రవితేజశ్రీ, డాక్టర్ కృష్ణవేణి ముందుకు రాగా డీసీహెచ్‌ఎస్ రవిబాబు సహకారంతో ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ఏజెన్సీ ఏరియాలో అత్యాధునిక పరికరాలు, ఎండోస్కోపీ అందుబాటులోకి రావటంతో ఖరీదైన వైద్యం పేదల ముంగిటకు చేరినట్టయింది. ఈ సందర్భంగా వైద్యులు రవిబాబు, రవితేజశ్రీ, కృష్ణవేణి, సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌ను టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందించారు.

'గెయిల్' సాయంతో..
డీసీహెచ్‌ఎస్ రవిబాబు సమీప బంధువు గెయిల్ సంస్థలో ఉన్నతోద్యోగిగా ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సరైన వైద్య సేవలు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లగా రూ.50 లక్షల విలువైన పరికరాలు ఇప్పించేందుకు గెయిల్ సంస్థ ముందుకొచ్చింది. దీంతో ఇల్లెందు ఆస్పత్రికి అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేశారు. వీటి సాయంతోనే ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. కాగా, ప్రస్తుతం కలీల్ ఆరోగ్యం నిలకడగా ఉందని రవిబాబు వెల్లడించారు.

ఇద్దరికి థైరాయిడ్ ఆపరేషన్..


జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఇద్దరికి థైరాయిడ్ సర్జరీలు చేస్తున్న వైద్యులు

కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యమైన థైరాయిడ్ సర్జరీని గురువారం ఇద్దరికి నిర్వహించారు. మణుగూరుకు చెదిన ఐనాల రవి గొంతు భాగంలో వాపు వచ్చి థైరాయిడ్ సమస్యతో ఈనెల 5న సర్వజన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఇల్లెందుకు చెందిన శశికళ మెడ భాగంలో వాపుతో ఈనెల 13న చేరింది. అప్పటి నుంచి వీరిని పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కానీ థైరాయిడ్ ఆపరేషన్ చేస్తే పేషెంట్లు ఒక్కోసారి ప్రమాదానికి గురవుతారు. మరి కొందరికి వెంటిలేటర్ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే సర్వజన ఆస్పత్రిలో ఒక్క వెంటిలేటర్ కూడా పని చేయటంలేదు. సరైన మందులు కూడా లేవు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొత్తగా 5 కాటరీ మిషన్‌లు అందించగా వీటితో సర్జరీ చేస్తే రక్తస్రావం తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ పరికరాల సాయంతో జనరల్ సర్జన్ నవ్యదీప్, సర్జన్ (హెచ్‌ఓడీ) శ్యాంసన్, ఈఎన్‌టీ సర్జన్ రవి కలిసి ఇద్దరికీ థైరాయిడ్ ఆపరేషన్లు చేశారు. అనస్తీషియాలు డాక్టర్ రమేష్, రాము మత్తు ఇవ్వగా స్టాఫ్ నర్సులు స్రవంతి, స్వాతి, శిరీష సహకరించారు. కాగా, సర్జరీ చేసిన వైద్యులను ప్రిన్సిపాల్ రాజకుమార్, సూపరింటెండెంట్ రాధామోహన్ అభినందించారు.

పామాయిల్ ఫ్యాక్టరీల్లో మలేషియా ఇంజనీర్లు!


ఫ్యాక్టరీలో యంత్రాలను పరిశీలిస్తున్న ఇంజనీర్ల బృందం

దమ్మపేట/అశ్వారావుపేట రూరల్: మలేషియాలోని వైకేఎల్ కంపెనీ ఇంజనీర్లు భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలంలోని అప్పారావుపేట, అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలను గురువారం సందర్శించారు. ఈ ఫ్యాక్టరీల్లో ప్రస్తుతం మలేషియా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈనేపథ్యాన ఫ్యాక్టరీల్లో పామాయిల్ క్రూడ్ ఆయిల్ రికవరీ రేటుపై ఆరా తీసిన వారు రికవరీ రేటు మరింత పెరగడానికి ఉన్న అవకాశాలపై సమీక్షించారు. ఫ్యాక్టరీల్లో యంత్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఇంజనీర్లు.. ఆయిల్ రికవరీ రేటు పెంపుదలకు చేపట్టాల్సిన చర్యలపై ఆయిల్‌ఫెడ్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విభాగం మేనేజర్లు శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కల్యాణ్, నాగబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాబ్‌మేళాకు 40 మంది హాజరు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ఉద్యోగులు

చుంచుపల్లి: చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు జిల్లా వ్యాప్తంగా 40 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా ఉపాధికల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ పర్యవేక్షణలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసేందుకు మొత్తం 50 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 26 మంది ఎంపికయ్యారు.

డైరెక్టర్ (ఈ అండ్ ఎం) పదవీకాలం పొడిగింపు


డైరెక్టర్ సత్యనారాయణరావును సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయనకు జీఎం(సీపీపీ) జక్కం రమేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. డైరెక్టర్ సోలార్, విద్యుత్ రంగాల్లో అభివృద్ధికి పాటుపడుతున్న సత్యనారాయణ పదవీకాలాన్ని పొడిగించడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు దిలీప్‌కుమార్, మనోజ్ కుమార్, మీనాజుద్దీన్, కార్తీక్‌శర్మ, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు


ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలో అనుమతులు లేకుండా, లైసెన్సు లేకుండా అల్లోపతి మందులు విక్రయిస్తున్న ఆర్‌ఎంపీపై కేసు నమోదైంది. గురువారం జిలా ఔషధ తనిఖీ అధికారి సీహెచ్ సంపత్ కుమార్ సత్యనారాయణపురంలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌లో తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న సుమారు రూ. 20 వేల విలువైన 29 రకాల అల్లోపతి మందులను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి భద్రాచలం కోర్టులో హాజరుపరచారు.

బియ్యం లారీ సీజ్


లారీని పట్టుకున్న సివిల్ సప్లయీస్ అధికారులు

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీని సివిల్ సప్లయీస్ అధికారులు సీజ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఒడిశాకు లారీలో బియ్యం తరలిస్తుండగా గురువారం పాల్వంచ పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా లారీలో 300 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం బియ్యం లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. బియ్యం శాంపిల్స్‌ను పరీక్షలకు పంపించామని, రేషన్ బియ్యంగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేశామని సివిల్ సప్లయీస్ డీటీ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య


రాజు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: అప్పుల బాధతో ఓ ప్రైవేట్ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తగూడెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన వడ్లకొండ రాజు(37) స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్‌లో క్రెడిట్ కార్డ్ కలెక్షన్ డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఇటీవల అప్పులు ఎక్కువగా చేశాడు. అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు లేఖ రాసి, మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య నాగప్రసన్న ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రాజుకు రెండు నెలల బాబు ఉన్నాడు. కాగా, తన భర్త ఆత్మహత్యకు అప్పుల బాధతో పాటు ఆఫీస్‌లో పని ఒత్తిడి తట్టుకోలేకపోవడం కూడా కారణమని నాగప్రసన్న ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

కదలని 'స్త్రీనిధి'


సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు(ఫైల్)

- లక్ష్యం రూ.94 కోట్లు.. ఇచ్చింది రూ.15 కోట్లు
- సిబ్బంది కొరతతో సకాలంలో అందని రుణాలు
- ప్రైవేట్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే స్త్రీనిధి రుణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా నీరసించింది. సిబ్బంది కొరతతో రుణాల మంజూరు ప్రక్రియ సన్నగిల్లింది. దీంతో మహిళలు ప్రైవేటు బ్యాంకులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు.

1,80,213 మంది సభ్యులు

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 981 గ్రామ సంఘాలు ఉన్నాయి. అందులో 18,244 స్వయం సహాయక సంఘాల పరిధిలో 1,80,213 మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘాల అర్హతల ఆధారంగా బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు, స్త్రీనిధి, పీఎం స్వనిధి రుణాలు అందజేస్తారు. పల్లెల్లో డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో, పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగుతుంది. బ్యాంకుతో నిమిత్తం లేకుండా స్త్రీనిధి ద్వారా పొదుపు సంఘాల మహిళలకు రూ.75 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంది. తాజాగా మహిళా శక్తి పేరుతో స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

రుణ మంజూరులో తీవ్ర జాప్యం

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా రూ.94 కోట్లు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. నిధులు కూడా విడుదల చేసింది. కానీ ఏడు నెలలు గడుస్తున్నా కేవలం రూ.15 కోట్ల రుణం మాత్రమే ఇచ్చారు. సాధారణ రుణాలతోపాటు మహిళా శక్తి పేరుతో మహిళలకు అందజేయాల్సిన స్వయం ఉపాధి యూనిట్ల మంజూరు ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది. రికవరీ విషయంలోనూ స్త్రీనిధి వెనుకబడింది. గతేడాది 78శాతం రికవరీ చేయగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 50 శాతం మాత్రమే రికవరీ చేశారు.


ఇల్లెందు సెర్ప్ కార్యాలయం

జిల్లావ్యాప్తంగా ముగ్గురే సిబ్బంది

స్త్రీనిధి విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. గతంలో రెండు మండలాలకో ఉద్యోగిని నియమించేవారు. కారణమేదైనా క్రమంగా ఉద్యోగులు ఒక్కొక్కరుగా విధుల నుంచి తప్పుకోవడంతో ప్రస్తుతం ముగ్గురే మిగిలారు. వీరే జిల్లావ్యాప్తంగా పొదుపు సంఘాల మహిళలకు రుణాలు మంజూరు చేస్తున్నారు. ఈ కారణంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీ 20 శాతానికి మించలేదు.

తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ బ్యాంక్‌లకు..

స్త్రీనిధి ద్వారా రుణాలు సకాలంలో అందకపోవడంతో మహిళలు ప్రైవేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి, ఆర్థిక అవసరాలను తీర్చుకుంటున్నారు. అయితే ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవొద్దని సెర్ప్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. సకాలంలో రుణాలు అందిస్తే తాము ప్రైవేటు బ్యాంకులకు ఎందుకు వెళ్తామని ప్రశ్నిస్తున్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.94 కోట్లు. సిబ్బంది కొరత కారణంగా ఇప్పటివరకు రూ.15 కోట్లు మంజూరు చేశాం. జిల్లాలో 13 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం ముగ్గురే విధుల్లో ఉన్నారు. వారిమీదే పనిభారం పడుతోంది. సిబ్బంది అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–శ్రీనివాస్, ఆర్‌ఎం, స్త్రీనిధి

విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కోనే నిర్మించాలి


కేటీపీఎస్ గేటు ముందు నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పాల్వంచ/మణుగూరు రూరల్: రామగుండంలో విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఇంజనీర్లు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశ గేటు ముందు, మణుగూరులోని బీటీపీఎస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ స్థానంలో సింగరేణి, జెన్‌కో సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలను కోవడం సరికాదన్నారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, 30వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీవరకు గేట్ మీటింగ్‌లు, 4, 5వ తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలు చేపడతామని వివరించారు. ఆందోళనల్లో విద్యుత్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇంజనీర్ల, కార్మిక సంఘాల బి.రవిప్రసాద్, రవితేజ, సాయి, బి.కృష్ణ, వి.ప్రసాద్, వీరస్వామి, మంగీలాల్, మధుబాబు, బ్రహ్మాజీ, మహేష్, గిరిధర్, రాజేందర్, మజీద్, రాధకృష్ణ, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సయ్యద్, ధనయ్య, యాస్మీన్, యాకూబ్, రవి, అశ్విని, అనూష పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు


యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు 12 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీ గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో పాల్వంచలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినిలు వివిధ పోటీల్లో ప్రతిభ చూపారు. ఉపన్యాస పోటీలో జి.శ్రావణి (ఎంఎస్‌సీఎస్) ప్రథమ బహుమతిని గెలుపొందగా, కవిత్వం పోటీలో టి.విజయలక్ష్మీ(బీజెడ్‌సీ) ద్వితీయ, గ్రూప్ పాటల పోటీలో ఆర్.అంకిత బృందం ప్రథమ బహుమతి, సోలో పాటల పోటీలో ఎ.అలైఖ్య ద్వితీయ, నృత్యపోటీలో యు.పూజిత బృందం ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. 12 మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావడం పట్ల ప్రిన్సిపాల్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

ఏజెన్సీలో భద్రత కట్టుదిట్టం

- సరిహద్దుల్లో ముమ్మరంగా కూంబింగ్
- పూసుగుప్ప ఘటన నేపథ్యంలో క్యాంపులకు అదనపు పోలీస్ బలగాలు


చర్ల–పూసుగుప్ప మార్గంలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: మావోయిస్టులు బుధవారం రాత్రి చర్ల మండలంలోని పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడికి దిగిన నేపథ్యంలో పోలీసులు ఏజెన్సీలో భద్రత కట్టుదిట్టం చేశారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు నెల రోజులపాటు 20వ ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ, చర్ల శబరి ఏరియా కమిటీలు వేర్వేరుగా ప్రకటనలు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో సరిహద్దులో మోహరించిన పోలీసు బలగాలు ముమ్మరంగా కూంబింగ్ చేస్తుండగా, మావోయిస్టులు సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడికి దిగడం సంచలనంగా మారింది. క్యాంపులోని బలగాలు సైతం అప్రమత్తమై ఎదురు దాడికి దిగడంతో మావోయిస్టులు ఉడాయించారు. ఈ ఏడాది జనవరిలో సరిహద్దు పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతవాగు, ధర్మారం క్యాంపులపై మావోయిస్టులు దాడికి దిగారు. అదే తరహాలో పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్ క్యాంపుపై దాడికి ప్రయత్నించగా, పోలీసు బలగాలు అప్రమత్తంగా వ్యవహరించడంతో మావోయిస్టుల వ్యూహం బెడిసికొట్టింది. కాగా సరిహద్దుల్లో ఉన్న ఇతర క్యాంపులపై కూడా మావోయిస్టులు దాడులకు దిగవచ్చనే అనుమానంతో క్యాంపుల్లో భద్రత పెంచారు. అదనపు బలగాలను తరలించారు. నిత్యం క్యాంపుల చుట్టూ డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్నారు. సీసీ కెమెరాల పుటేజీని నిశితంగా పరిశీలిస్తున్నారు. క్యాంపులు ఉన్న అన్నీ ప్రాంతాల్లోని అటవీ భూభాగంలో పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లోకి వెళ్లి వచ్చే ప్రతీ వ్యక్తిని, ప్రతీ వాహనాన్ని నిశితంగా తనిఖీ చేస్తున్నారు.

అప్రమత్తతతోనే దాడిని తిప్పికొట్టాయి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజువర్మ

చర్ల: పోలీసు బలగాలు అప్రమత్తంగా వ్యవహరించి మావోయిస్టుల దాడిని తిప్పికొట్టాయని, వారి కవ్వింపు చర్యలకు దీటుగా సమాధానం చెప్పాయని చర్ల సీఐ ఏ.రాజువర్మ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్ క్యాంప్‌పై నార్త్ ఈస్ట్ వైపు నుంచి మావోయిస్టులు కాల్పులు జరపడం ప్రారంభించారని తెలిపారు. బీజీజీఎల్‌లను కూడా క్యాంపు పైకి వేశారని, అయితే అవి క్యాంపునకు బయట వైపునే పడిపోయాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా రాంపురం, బీమారంపాడు గ్రామాల వైపు నుంచే మావోయిస్టులు వచ్చినట్లు తెలుస్తోందని వివరించారు. మావోయిస్టులు వేసిన బీజీఎల్‌లలో కొన్ని పేలి ఉండక పోవచ్చని, క్యాంపు సమీపంలోని అటవీ ప్రాంతంలో మందుపాతరలు ఏర్పాటు చేసి ఉండవచ్చనే అనుమానంతో బీడీఎస్ టీం పరిశీలిస్తోందని తెలిపారు. క్యాంపు ప్రాంతం వైపు ఎవరినీ అనుమతించడంలేదని, పశువుల కాపరులు, రైతులు కూడా అటువైపు వెళ్లవద్దని సూచించారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

దుమ్ముగూడెం : మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. పీఎల్‌జీఏ ఒకటో నంబర్ బెటాలియన్‌కు పేలుడు పదార్థాలు తీసుకెళ్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని దేవి చౌక్, పట్నంపర వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు 2020 నుంచి మావోయిస్టులకు కావాల్సిన వస్తువులను సరఫరా చేస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

బైక్ చక్రంలో చీర చిక్కుకుని పల్టీ..

దంపతులకు తీవ్రగాయాలు

కామేపల్లి: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగూడెం పట్టణానికి చెందిన పొన్నం తులసీరామ్, ఆయన భార్య కళావతి బైక్‌పై ఖమ్మంలో ఉన్న తమ కుమారై వద్దకు గురువారం కామేపల్లి మీదుగా వెళ్తున్నారు. కాగా, తాళ్లగూడెం స్టేజీ సమీపాన కళావతి చీర కొంగు బైక్ వెనకాల చక్రంలో పడి చుట్టుకోవడంతో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కళావతి తలకు తీవ్రగాయం కాగా తులసీరామ్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిని స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో హోటల్ నిర్వాహకుడు మృతి


రాము (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): రోడ్డు ప్రమాదంలో మాజీ విలేకరి, హోటల్ నిర్వాహకుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సింగరేణి ప్రధానాస్పత్రి వద్ద హోటల్ నిర్వహించే రాము(45) గురువారం తెల్లవారుజామున 3 ఇంక్లైన్ సమీపంలో రోడ్డుమీద ఆగి ఉన్న బైక్‌పై కూర్చొని.. ముందు ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ వచ్చి బైక్‌ను ఢీకొనగా రాముకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

సుజాతనగర్ : చెత్త కుప్పలో పడేసి ఉన్న రెండు గంజాయి ప్యాకెట్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వేపలగడ్డ సమీపంలో ఆర్వోబీ వంతెన పక్కన ఐదు కిలోల గంజాయి ప్యాకెట్లు ఉండగా, గమనించిన కూలీలు ఇంటి యాజమానికి సమాచారం ఇచ్చారు. అతని సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తనిఖీలు చేపట్టిన క్రమంలో గమనించిన గంజాయి రవాణాదారులు వాటిని చెత్త కుప్పలో విసిరేసినట్లు తెలుస్తోంది.

ఇల్లెందులో..

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన పి.సురేష్ ఇంట్లో 600 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం జాగిలంతో పోలీసులు తనిఖీలు చేపట్టి గంజాయిని గుర్తించారు. కొంతకాలంగా గంజాయికి అలవాటు పడిన సురేష్ పలువురిని సంప్రదించి గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గుండాల: ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై గురువారం ఆళ్లపల్లి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు ఇల్లెందుకు చెందిన ఓ మైనర్ బాలిక వెంటపడి ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. శారీరకంగా వాడుకుని గర్భవతిని చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై అత్యాచారం కేసు, పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రతీష్ తెలిపారు.

చోరీకి పాల్పడ్డ యువతులు

పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

భద్రాచలంఅర్బన్: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువతులను గురువారం స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి రోడ్డులో యూనియన్ బ్యాంక్ సమీపంలో ఆశా కార్యకర్త ఒకరు జిరాక్స్ తీయిస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరు యువతులు ఆశా కార్యకర్త పర్సును చోరీ చేశారు. అందులో రూ.5 వేల నగదు తీసుకుని, ఐడీ కార్డులను పడేశారు. గమనించిన ఆశా కార్యకర్త దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా, ఇద్దరు యువతులు పర్సు దొంగిలించినట్లు బయటపడింది. అదే ప్రాంతంలో యాచకుల్లా తిరుగుతున్న వారిని స్థానికులు పట్టుకుని నగదును ఆశా కార్యకర్తకు ఇప్పించారు. అనంతరం వారిని చోరులను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లు

పోలీసులను ఆశ్రయించిన పలువురు?

ఖమ్మంఅర్బన్: ఖమ్మంకు చెందిన కొందరి వద్ద ఉద్యోగాల పేరుతో పలువురు వసూళ్లకు పాల్పడగా చివరకు మోసమని తేలడంతో బాధితులు గురువారం ఖమ్మం అర్బన్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఖమ్మంకు చెందిన ఒక వ్యక్తి, భద్రాచలానికి చెందిన మహిళ కలిసి ఉద్యోగాల పేరుతో వసూలు చేసినట్లు ప్రచారం. ఒక్కొక్కరి వద్ద రూ.3లక్షల వరకు వసూలు చేసినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇద్దరు బాధితులను పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. అయితే, బాధితులు పెద్ద సంఖ్యలోనే ఉంటారని ప్రచారం జరుగుతోంది.పోలీసులు పూర్తి స్థాయిలో విచారిస్తే ఎందరు బాధితులు ఉన్నారో బయట పడే అవకాశముంది. ఈ విషయమై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు


లక్ష్మీనగరంలో ఆదివాసీ హక్కుల సంఘం పేరిట వెలిసిన పోస్టర్లు

కొత్తగూడెం అర్బన్/దుమ్ముగూడెం: మావోయిస్టు పార్టీ 20 సంవత్సరాల సంబరాలు ఎవరికోసం, ఎందుకోసం జరుపుకుంటోందని ప్రశ్నిస్తూ ఆదివాసీ హక్కుల సంఘం పేరిట దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం, పెద్దబండిరేవు, పెద్దనల్లబల్లి గ్రామాల్లో గురువారం పోస్టర్లు, కరపత్రాలు వెలిశాయి. సోషల్ మీడియాలో కూడా పోస్టులు చక్కర్లు కొట్టాయి. అనారోగ్యం బారిన పడినవారిని ఆదివాసీలు జోలె కట్టి మోసుకొస్తున్న, రహదారులపై మావోయిస్టులు మందుపాతరలు పేల్చడంతో ఏర్పడిన గుంతల ఫొటోలు కరపత్రాల్లో ముద్రించారు. 'మావోయిస్టులు మా ఊళ్లకు నీటి సౌకర్యం కల్పించారా, పాఠశాల కట్టించారా, రోడ్డు వేయించారా, వైద్యసదుపాయం కల్పించారా, ఆదివాసీ బిడ్డల జీవితాలు బాగు చేశారా? అంటూ కరపత్రాల్లో ప్రశ్నించారు. 'ఆదివాసీ, దళితులను చదువులకు, ఉద్యోగాలకు, ఉపాధికి దూరం చేశారని, మావోయిస్టుల మాటలు నమ్మి పార్టీలో చేరిన సుమారు 5 వేల మంది బిడ్డలు ప్రాణాలు పోగొట్టుకున్నారని, అధిపత్య కులాల వారే మావోయిస్టు పార్టీలో అగ్ర నాయకులుగా చలామణి అవుతూ ఆదివాసీ, దళిత బిడ్డలను అణగదొక్కుతున్నారని, ఇన్‌ఫార్మర్ల పేరుతో ఆడ బిడ్డలను హత్య చేశారని' కరపత్రాల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

దమ్మపేట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మంగాపురం శివారులో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం... మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కామినేని శ్యాంబాబు (39) బుధవారం రాత్రి మంగాపురం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో మంగాపురం శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒక్కసారిగా కింద పడింది. అతడు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయిస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


అక్షర (ఫైల్)

కరకగూడెం: పురుగుల మందు తాగి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని కలవలనాగారం గ్రామానికి చెందిన కలం రాములు, సావిత్రి దంపతులకు సంతానం లేకపోవడంతో పుట్టగానే అక్షర(17)ను బంధువుల వద్ద నుంచి దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఆమె ఈ నెల 6న కళాశాల నుంచి ఇంటికి వచ్చింది. మళ్లీ కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లి మందలించగా, మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు భద్రాచలం, ఖమ్మం ఆస్పత్రుల్లో వారం రోజులపాటు చికిత్స అందించగా, ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటికి తీసుకొచ్చారు. రెండు రోజుల తర్వాత మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా, బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రహదారిపై నిలిచిన ఇసుక లారీలు

దుమ్ముగూడెం : మండలంలోని రేగుబల్లి గ్రామంలోని నందులచెలక ర్యాంపు నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీలు భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోయాయి. రేగుబల్లి నుంచి తూరుబాక వరకు బారులుదీరాయి. తూరుబాక దగ్గర కల్వర్టు కుంగి పోవడంతో అధికారులు ఇసుక లారీల రాకపోకలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో వందలాది లారీలు ప్రధాన రహదారిపై నిలిచిపోయాయి. దీంతో భద్రాచలం–చర్ల రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి 7 గంటల తర్వాత ఇసుక లారీలకు అనుమతి ఇవ్వడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.